




# వార్త మిర్రర్


మంగళవారం, డిసెంబర్ 31, 2024

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 10 | వెల 4/-




## సత్తా చాటిన ఇస్రో

రోదసిలోకి స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు..

15.13 నిమిషాల్లోనే కక్ష్యలోకి చేర్చిన పీఎస్ఎల్వీ-సీ60

## కమీషన్లు ఇస్తేనే బిల్లుల మంజూరు

రాష్ట్రంలో మంత్రుల మధ్య అంతర్యుద్ధం

సీఎం రేవంత్‌కు, అల్లు అర్జున్‌కు ఎక్కడో చెడింది

రేవంత్‌లో గొప్ప నాయకుడు ఎలా కనిపించారో.. పవన్ కల్యాణ్‌కే తెలియాలి: కేంద్ర మంత్రి సంజయ్





## ఇక నెలలో 14 రోజులు జనంలోనే..

కార్యాలయంలో కూర్చుంటే సమస్యలు తెలియవు

తనిఖీలు చేసి తిరిగొచ్చేస్తే పెద్ద ఫలితం ఉండదు

అందుకే జిల్లాల పర్యటనకు సిద్ధమవుతున్నా

జనసేనలో పనితీరే ప్రామాణికంగా పదవులు

బంధుప్రీతి ఉంటే నాగబాబుకు మొదట్లోనే పదవి

**మా పాలన సంతృప్తికరం: పవన్**

అమరావతి, డిసెంబరు 30 : కార్యాలయాల్లో కూర్చొని ప్రజల సమస్యలకు పరిష్కారాలు వెతకాలని చూస్తే గందరగోళానికి గురవుతామనీ, అందుకే జిల్లాల పర్యటనకు సిద్ధం అవుతున్నానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. నెలలో 14 రోజులు జిల్లాల్లో ప్రజల మధ్య ఉండాలని అనుకుంటున్నానని ఆయన వివరించారు. సోమవారం ఉదయం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మీడియాప్రతినిధులతో పవన్ కల్యాణ్ చిట్‌చాట్ నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధి పంచాయతీల్లోనేఉందని, ఆ శాఖను చూడటం వరంగా భావిస్తున్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. "అక్కడెక్కడో ఉంటాడు... ఏం వస్తాడులే' అనే నిర్లక్ష్యం

(మిగతా 2వ పేజీలో)

## కాంగ్రెస్‌లో మన్మోహన్‌కు ఎన్నో అవమానాలు


అగ్రనేతల నుంచి అడుగడుగునా పరాభవాలు.. ప్రధానిగా పదేళ్లు వాటిని భరిస్తూనే దేశానికి సేవలు

యూపీఏలో షాడో పీఎంలుగా సోనియా, రాహుల్

కేంద్రం సంతాప దినాలు ప్రకటిస్తే.. నూతన సంవత్సర వేడుకల కోసం రాహుల్ వియత్నాం వెళ్లడం ఏంటి?

విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి





## చంద్రబాబు సంపద 931 కోట్లు

దేశంలో సంపన్న సీఎం ఆయనే

ముఖ్యమంత్రి మమత ఆస్తి 15 లక్షలే

ఏడీఆర్ నివేదిక వెల్లడి

## పనిలేని సర్కారు పసలేని కేసు

కక్ష సాధింపులో భాగమే ఈ-రేస్ అభియోగాలు

అవినీతే లేనప్పుడు ఏసీబీ విచారణ ఎందుకు?

రేస్ రద్దు చేసి, కాంట్రాక్ట్ ఎందుకు రద్దు చెయ్యలే?

కేసులకు భయపడం.. చట్టపరంగా ఎదుర్కొంటాం

ఏడాది కాంగ్రెస్ పాలన అంతా మోసపూరితం


ఆరింటిలో అర గ్యారెంటీ కూడా అమలు కాలేదు



**మీడియా చిట్‌చాట్‌లో మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, డిసెంబర్ 30 : ఫార్ములా-ఈ రేస్‌లో అక్రమాలు జరిగాయని అసెంబ్లీ సాక్షిగా సీఎం పచ్చి అబద్ధాలు చెప్పారని, అడుగడుగునా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే తనపై తప్పుడు కేసు పెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. 360 రోజులు అధికారం వెలగబెట్టి ఆరు గ్యారెంటీల్లో కనీసం అర గ్యారెంటీని కూడా అమలు చేయని ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందని ఎద్దేవాచేశారు. 'అవినీతి జరిగిందంటూ ఏసీబీని ఉసిగొల్పుతున్నరు..ఈడీని తెచ్చి భయపెట్టాలని చూస్తున్నరు..బడే భాయ్..చోటే భాయ్ ఏకమై కక్ష సాధిస్తున్నరు. ఎంతగా భయపెట్టాలని చూసినా బెదిరేదిలేదు.. తప్పుడు కేసులకు భయపడేది లేదు..న్యాయం కోసం కోర్టుల్లోనే కొట్లాడుతాం' అని తేల్చిచెప్పారు. అక్రమాలకు పాల్పడ్డానని తనపై కేసులు బనాయించిన ప్రభుత్వం, మరి ఫార్ములా ఈ కంపెనీపై ఎందుకు కేసు పెట్టలేదని నిలదీశారు. ఫార్ములా ఈ-రేస్‌లో అవినీతి జరగలేదని

(మిగతా 2వ పేజీలో)




## గోదావరి-బనకచర్ల అనుసంధానంతో

# తెలుగుతల్లికి జలహారతి

కృష్ణా నదిలో నీళ్లు తగ్గాయి. గోదావరిలో 4,114 టీఎంసీల వరద సముద్రంపాలవుతోంది. నదుల అనుసంధానంతో ఇందులో కనీసం కృష్ణాకు 200 టీఎంసీలను తరలించినా కరువు, వరదలను ఎదుర్కోవచ్చు.బనకచర్లకు గోదావరి నీటిని తీసుకువెళ్లగలిగితే.. రాష్ట్రంలో అంతర్గతంగా నదుల అనుసంధానం పూర్తయినట్లే. తెలుగు తల్లికి జలహారతి ఇచ్చినట్లే!

- ముఖ్యమంత్రి చంద్రబాబు

తొలి దశలో రూ.13,511 కోట్లతో పోలవరం - ప్రకాశం బ్యారేజీకి జలాలు

అక్కడి నుంచి బొల్లాపల్లి వరకు.. రెండో దశలో 150 టీఎంసీల ఎత్తిపోత

దీని అంచనా వ్యయం 28,560 కోట్లు.. మూడో దశలో బనకచర్లకు తరలింపు

38,014 కోట్లతో రోజుకు 2 టీఎంసీలు.. మొత్తంగా 368 కి.మీ. ప్రయాణం

కేంద్రం, రాష్ట్రం, ప్రైవేటు భాగస్వామ్యంతో హైబ్రిడ్ పద్ధతిలో అమలు: ముఖ్యమంత్రి

అమరావతి, డిసెంబరు 30 : గోదావరి-బనకచర్ల అనుసంధానంతో కరువును శాశ్వతంగా జయించి... రాష్ట్రానికి జల భద్రత కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. మూడేళ్లలో రూ.80,112 కోట్లతో గోదావరి-బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్ అనుసంధానం పూర్తిచేసేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. 'తెలుగు తల్లికి జలహారతి' పేరిట చేపట్టనున్న ఈ ప్రాజెక్టు గురించి సోమవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో మీడియాకు ఆయన వివరించారు. బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్ రాయలసీమకు గేట్‌వేగా మారుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రానికే గేమ్ చేంజర్ అవుతుందని చెప్పారు. ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు

(మిగతా 2వ పేజీలో)

# రాష్ట్రానికి పురుడు పోసిన డాక్టర్ మన్మోహన్

సోనియాగాంధీ ఇచ్చిన మాటను నెరవేర్చిన గొప్ప నాయకుడు

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం..శాసనసభలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు

మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలని తీర్మానం.. ఆమోదం.. రుణ మాఫీకి ఆయనే స్ఫూర్తి: భట్టి

మన్మోహన్ ప్రతిభను గుర్తించింది పీవీ.. ఆయనకూ రాజధాని ఢిల్లీలో స్మారకం ఏర్పాటు చేయాలి: కేటీఆర్




హైదరాబాద్, డిసెంబరు 30 : మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పురస్కారమైన భారత రత్నను ప్రదానం చేయాలని తెలంగాణ శాసన సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆయన మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానానికి శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇటీవల మరణించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులు అర్పించడానికి సోమవారం శాసనసభ ప్రత్యేకంగా సమావేశమైంది. ఇందులో మన్మోహన్‌కు భారత రత్న పురస్కారం ప్రదానం చేయాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టి సీఎం రేవంత్ ప్రసంగించారు. "మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ తెలంగాణకు ఆత్మబంధువు. 60 ఏళ్ల ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసిన

(మిగతా 2వ పేజీలో)

# నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భాగ్యనగర పోలీసులు అలర్ట్

## రంగంలోకి దిగిన నార్కోటిక్స్ బ్యూరో పోలీసులు



భాగ్యనగరం వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నగర పోలీసులు అలర్ట్ అయ్యారు. పబ్, బార్‌ల, ఈవెంట్ నిర్వహిస్తున్న నిర్వహకులపై నిఘా పెట్టారు. హైదరాబాద్ లోని పబ్బులు, బార్లు, రెస్టారెంట్లు, రిసార్ట్‌లపై నిఘా పెంచారు.న్యూయర్ వేడుకలపై రంగంలోకి దిగిన నార్కొటిక్స్ బ్యూరో పోలీసులు.. స్థానిక పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో కలిసి తనఖీ చేశారు. వేడుకల్లో ఎటువంటి డ్రగ్స్ కు వినియోగించకుండ చర్యలు తీసుకోవాలని యజమానులకు ఆదేశించారు. డ్రగ్ ఫ్రీ వేడుకలు నిర్వహిస్తామని వారి నుంచి అండర్‌టేకింగ్ తీసుకున్నారు. బంజారాహిల్స్ పరిధిలోని టాస్, హెూయిస్ట్, పార్క్ హయత్, లీలా హైదరాబాద్ స్టార్ హెూటల్ అండ్ బార్‌లలో తనిఖీలు చేశారు. ఉప్పల్ పరిధిలోని వేవ్ పబ్, రాజేంద్ర నగర్‌లోని సిలెబర్ టెర్రేస్ కిచెన్‌లో తనిఖీలు చేపట్టారు. ఫిల్మ్ నగర్ లోని మూన్ షైన్ పబ్, జూబ్లీహిల్స్ లోని పలు పబ్బులు, బార్లలో తనిఖీలు చేశారు.సరూర్ నగర్ పరిధిలోని అర్బన్ బీట్స్, నైన్ ఓ నైన్, 1634 ఈస్ట్ బార్, మోకిల పరిధిలోని రిసార్టులు, బార్లలో తనిఖీలు,గచ్చిబౌలి, రాయదుర్గం, నార్సింగి పరిధుల్లోని పబ్బులు బార్లలో పోలీసులు తనిఖీ చేసిన వారి నుంచి అండర్ టేకింగ్ తీసుకున్నారు. పబ్బులలో డ్రగ్స్ దొరుకితే సీజ్ చేయడంతో పాటు లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. సమయం ఇచ్చిన ప్రకారమే పబ్‌లు నిర్వహించాలని తెలిపారు. మందు సప్లై కూడా సమయం పాటించాలని సమయానికి మించి మందులు సప్లై చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. న్యూయర్ వేడుకల్లో అపశృతి చోటుచేసుకోకుండా పబ్ నిర్వాహకులు జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. ఏమాత్రం అలసట నిర్వహించినా చర్యలు తప్పవని పేర్కొన్నారు.మరోవైపు తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన లక్ష్యం గా ఎక్సైజ్ డిపార్ట్మెంట్ పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పనిచేస్తున్నామన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ ను కట్టడి చెయ్యడం లో ఎక్సైజ్ శాఖ బాగా కృషి చేసిందన్నారు. గంజాయి, డ్రగ్స్ ఎక్కువగా వినియోగించే ప్రాంతాలను గుర్తించామన్నారు. పబ్స్ పై ప్రత్యేక బృందాలతో స్పెషల్ ఆపరేషన్ నిర్వహించామని, గంజాయి నిర్మూలనలో భాగంగా ఆపరేషన్ ధూల్ పేట్ నిర్వహించామన్నారు.

# పనిలేని సర్కారు పసలేని కేసు

మంత్రి పొన్నం కూడా చెప్తున్నారని గుర్తుచేశారు. ఇదే విషయమై ముఖ్యమంత్రిని అసెంబ్లీ లాబీలో మీడియా ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పలేదని విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. విలేకరులు అడిగిన ప్రతిప్రశ్నకు సావధానంగా సమాధానాలు ఇచ్చారు. ప్రపంచ చిత్రపటంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకే ఫార్ములా ఈ సంస్థకు నగదు చెల్లించామని కేటీఆర్ చెప్పారు. ఈ విషయాన్ని సదరు సంస్థ కూడా ఒప్పుకొన్నదని గుర్తుచేశారు. ఇందులో ఎలాంటి అవినీతికీ పాల్పడలేదని స్పష్టంచేశారు. కానీ, ఇందులో ఏదో మతలబు ఉన్నది.. క్యాబినెట్ ఆమోదం ఉన్నదా? అంటూ ముఖ్య మంత్రి మాట్లాడటం విడ్డూరమని చెప్పారు.

## చంద్రబాబు సంపద 931 కోట్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 30: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే అత్యంత సంపన్న సీఎం అని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. ఆయన కుటుంబానికి రూ.931 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు తెలిపింది. అదేసమయంలో ఆయనకు రూ.10కోట్ల అప్పు ఉందని వెల్లడించింది. సీఎంల ఆస్తులు, అప్పులపై సోమవారం ఏడీఆర్ ఒక నివేదిక విడుదల చేసింది. దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యంత తక్కువ ఆస్తులున్నది బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకే అని... ఆమె వద్ద రూ.15 లక్షల ఆస్తే ఉందని ఏడీఆర్ పేర్కొంది. మొత్తంగా కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాల ముఖ్యమంత్రుల సగటు సంపద రూ.52.59 కోట్లుగా ఉందని నివేదిక వివరించింది. అంతేకాదు, సీఎంల సగటు వ్యక్తిగత ఆదాయం రూ.13,64,310గా పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం.. మొత్తం 31 మంది సీఎంల సంపద రూ.1,630 కోట్లు. రూ.332 కోట్ల సంపదతో అరుణాచల్‌ప్రదేశ్ సీఎం పెమాఖండు ధనికుల్లో రెండోస్థానంలో ఉన్నారు. జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా రూ.55 లక్షల సంపదతో పేద ముఖ్యమంత్రుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు.



## మన్నే సుబ్రమణ్యంకు ఘన నివాళిలు అర్పించిన పాత్రికేయులు

కాప్రా,వార్త మిర్రర్,డిసెంబర్ 30:ప్రముఖ పారిశ్రామిక వేత్త, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సంఘ సేవకులు మన్నే సుబ్రమణ్యం ఇటీవల హఠాన్ మరణం చెందారు.ఈ సందర్భంగా కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులు,టిడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు జర్నలిస్టులు మన్నే సుబ్రహ్మణ్యం స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా మన్నే సుబ్రహ్మణ్యం చేసిన సహాయ సహకారాలను గుర్తు చేసుకున్నారు.వారి కుటుంబ సభ్యులకు,కుమారుడు మన్నె ఫణీంద్ర కు తమ సానుభూతి తెలియజేస్తూ,మనో ధైర్యాన్ని అందించారు.ఈ కార్యక్రమం లో జర్నలిస్టులు,టిడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు పటేల్ నరసింహ, గుమ్మడి హరిప్రసాద్,దొమ్మాటి కిరణకుమార్ రావు, డి.శ్రీనివాసరావు, రామచంద్రమూర్తి, బి.ఎస్.బాబు,దాసారం శ్రీనివాస్,సురేష్ సాగర్,ఎం.కనక బాబు, తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు టీజీకే మూర్తి,తెలుగుదేశం పార్టీ ఉప్పల్ అడహక్ కమిటీ సభ్యులు నీరుకొండ సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి పురుడు పోసిన డాక్టర్ మన్మోహన్

నాయకుడు. ప్రధాని హెూదాలో తెలంగాణకు రాష్ట్ర హెూదా కల్పించారు. తెలంగాణతో ఆయన అనుబంధం విడదీయలేనిది. పార్లమెంటు ఉభయ సభల్లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందేలా చేసిన, రాష్ట్రానికి పురుడు పోసిన డాక్టర్‌గా మన్మోహన్ సింగ్‌ను తెలంగాణ సమాజం ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటుంది” అని అన్నారు. ఆయనకు భారతరత్న ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రజలకు సోనియా గాంధీ ఇచ్చిన మాటను పార్లమెంట్ ప్రక్రియ ద్వారా నెరవేర్చే బాధ్యత తీసుకున్న గొప్ప నాయకుడని కొనియాడారు. ఉద్యమాలను, ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని తెలంగాణ ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారని, అటువంటి మహనీయుడికి నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలపడమే కాకుండా ఘనంగా నివాళి అర్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ప్రజలు సోనియా గాంధీకి ఎంత రుణపడి ఉంటారో.. మన్మోహన్ సింగ్‌కు కూడా అంతే రుణపడి ఉంటారని అన్నారు. “ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ (ఎల్‌పీజీ) విధానాలను తీసుకొచ్చి.. ప్రపంచ దేశాలతో మన దేశం పోటీ పడేలా తీర్చిదిద్దడంలో తెలంగాణ బిడ్డ పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ వేసిన పునాదులే కారణం. ప్రపంచం గర్వించదగ్గ ఆర్థికవేత్త ఆయన. ఆయన మరణం కుటుంబానికే కాదు.. దేశానికి, ప్రపంచానికే తీరని లోటు. నీతి, నిజాయతీ, నిబద్ధతలో ఎవరినైనా ఆదర్శంగా తీసుకోవాలంటే అది మన్మోహన్ సింగ్. దేశ ప్రధానిగా పదేళ్లపాటు పని చేసిన ఆయన ప్రజాస్వామ్య రక్షణ కోసం మాతో కలిసి ధర్నాలో కూర్చున్నారు. నాకు, ఉత్తమ్, కోమటిరెడ్డికి ఆ సంఘటన జీవితకాలం గుర్తుండిపోతుంది” అని వివరించారు. ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టి.. అనంతపురం, మహ బూబ్‌నగర్‌ల్లో ఆ పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. రాజ్యాంగ నిర్మాతగా గొప్ప పరిపాలన అందించడానికి పునాది వేసిన అంబేడ్కర్ స్ఫూర్తిగా భూ సేకరణ చట్టంలో మార్పులు చేశారని, 2013 భూసేకరణ చట్టంలో గ్రామంలో ఉన్న వారందరికీ పరిహారం ఇచ్చేలా చేశారని గుర్తు చేశారు. అటవీ హక్కుల రక్షణ చట్టం-2006 వల్లే పోడు భూములకు పట్టాలిస్తున్నామని చెప్పారు.

### తెలంగాణకు మన్మోహన్ ఆశీస్సులు

“మన్మోహన్ మరణ వార్త విని.. ఢిల్లీ వెళ్లి ఆయన సతీమణిని కలిశాను. నివాళులర్పిస్తూ.. నేను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అని పరిచయం చేసుకున్నాను. అప్పుడు.. కూర్చో అని చెప్పి, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇచ్చారు. ఆ రాష్ట్రాన్ని మీరు కష్టపడి అభివృద్ధి పథంవైపు నడిపించాలి. మన్మోహన్ సింగ్ ఆశీస్సులు తెలంగాణకు ఉంటాయని మన్మోహన్ సింగ్ సతీమణి చెప్పారు” అని సీఎం రేవంత్ వివరించారు. ఎన్నో విషయాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. 140 కోట్ల మంది ప్రజలకు, అన్ని సంఘాలు, ఆర్ఎసఎస్ నుంచి ఆర్ఎసయూ వరకు, కమ్యూనిస్టుల నుంచి మిగతా అన్ని రాజకీయ పార్టీలు మన్మోహన్ సింగ్ విషయంలో ఏకాభిప్రాయం వ్యక్తం చేసే పరిస్థితి ఉందని చెప్పారు. క్లిష్టమైన పరిస్థితుల్లో ఆయన చతురతతో తెలంగాణ ఏర్పడిందని, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఆయన విగ్రహం పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

### రాష్ట్రం ఉన్నంత వరకూ మన్మోహన్ పేరు: భట్టి

తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం మన్మోహన్ పేరు చిరస్థాయిగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో మొట్టమొదటిసారి రైతు రుణమాఫీ చేశారని, రాష్ట్రంలో రెండు లక్షల రుణమాఫీ పథకానికి స్ఫూర్తి ఆయనేనని తెలిపారు. దేశ రాజకీయాల్లో మహెూన్నత శిఖరాలకు ఎదిగి.. నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ ఏర్పాటు చేసిన పునాదులపై సమున్నత ఆర్థిక సౌధాన్ని మన్మోహన్ నిర్మించారని మంత్రి శ్రీధర్‌బాబు కొనియాడారు. మన్మోహన్ సింగ్ తన పదేళ్లకాలంలో 114 విలేకరుల సమావేశాలు పెట్టినా.. మౌన ప్రధానిగా మీడియా, విపక్షాలు ప్రచారం చేశాయని ఆక్షేపించారు. దేశంలో ప్రస్తుతం ఉన్న స్టార్ట్‌పలకు ఆయనే స్ఫూర్తి అని తెలిపారు. దేశంలో పేదల సంక్షేమం కోసం మైలురాయి లాంటి చట్టాలు తెచ్చిన ఘనత మన్మోహన్‌కే దక్కుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. భూ సేకరణ చట్టం, అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ, ఆహార భద్రత, సమాచార హక్కు, విద్యా హక్కు వంటి చట్టాలతో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. మన్మోహన్ గొప్ప మానవతావాది, ఆర్థిక శిల్పి, దార్శనికుడని మంత్రి దామోదర రాజనర్సింహ కొనియాడారు. విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం ద్వారా దేశంలో ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకొచ్చారన్నారు. మన్మోహన్ మేథస్సు, ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాల గురించి ఈరోజు ప్రపంచం మొత్తం మాట్లాడుకుంటోందని, 15వ లోక్‌సభలో ఆయనతో కలిసి పని చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ మెట్రో, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నిధుల విడుదలలో ఆయన కృషి మరువలేనిదన్నారు. యువతకు స్ఫూర్తిగా, నిజాయితీకి నిలువుటద్దంగా ఉన్న మన్మోహన్ సింగ్ విగ్రహాలను అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి కోరారు. ఢిల్లీలో చలి కాలంలో తాము పార్లమెంట్ ముందు ధర్నా చేస్తుంటే 90 ఏళ్ల వయసులో కూడా తమతోపాటు ఆయన కూర్చున్నారని. ఆనాటి ఫొటోను చూస్తే కన్నీళ్లు వచ్చాయని అన్నారు. ఐదు నెలల వయసులో తల్లిని కోల్పోయిన ఆయన అనేక కష్టాలు పడి ఉన్నత స్థానానికి చేరారని మంత్రి సీతక్క గుర్తు చేశారు. గొప్ప సంస్కరణల ద్వారా సంక్షేమానికి చట్టబద్ధత కల్పించారని, అందుకే ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. ఆకలి మనిషికి అతి పెద్ద శత్రువు అని గుర్తించి దాన్ని రూపుమాపేందుకు ఆహార భద్రత చట్టం తెచ్చారని, విద్యా హక్కు చట్టం తీసుకొచ్చి 30 వేల కొత్త పాఠశాలలు నిర్మించారని గుర్తు చేశారు.

# కమీషన్లు ఇస్తేనే బిల్లుల మంజూరు

### రాష్ట్రంలో మంత్రుల మధ్య అంతర్యుద్ధం

### సీఎం రేవంత్‌కు, అల్లు అర్జున్‌కు ఎక్కడో చెడింది

### రేవంత్‌లో గొప్ప నాయకుడు ఎలా కనిపించారో.. పవన్ కల్యాణ్‌కే తెలియాలి: కేంద్ర మంత్రి సంజయ్

కరీంనగర్, డిసెంబరు 30 : కాంగ్రెస్ ప్రభుత్వంలో కమీషన్లు ఇస్తేనే బిల్లులు మంజూరవుతున్నాయని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పించాలని కోరుతూ తాజా మాజీ సర్పంచ్‌ల సంఘం నాయకులు కరీంనగర్‌లో సోమవారం బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ బిల్లు మంజూరు చేయాలన్నా 8 నుంచి 14 శాతం కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర క్యాబినెట్‌లో కొందరు నిజాయితీపరులైన మంత్రులు ఉన్నారని, కమీషన్ల విషయం వారికి ఏమాత్రం నచ్చడం లేదన్నారు. బిల్లులు, కమీషన్ల విషయంలో మంత్రుల మధ్య అంతర్యుద్ధం జరుగుతోందని దుయ్యబట్టారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు కప్పం కట్టడంపై ఉన్న శ్రద్ధ .. సమస్యల పరిష్కారంపై లేదని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 వేల మంది మాజీ సర్పంచ్‌లకు రూ.1300కోట్ల బిల్లులు రావాల్సి ఉందన్నారు. వీరి పక్షాన బీజేపీ ఉద్యమిస్తుందని, కాంగ్రెస్ మెడలు వంచి బిల్లులు మంజూరయ్యేలా చూస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు తీరు వల్లే నేరాలు పెరిగాయని సంజయ్ విమర్శించారు. మహిళలపై అత్యాచారాలు 28 శాతం పెరిగాయని, రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడలేని చేతగాని సర్కార్ ఉందని దుయ్యబట్టారు. “రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు.. క్రైం రేటు పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్‌రెడ్డిలో గొప్ప నాయకుడు ఎలా కన్పించారో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కే తెలియాలి. అల్లు అర్జున్‌కు రేవంత్‌కు ఎక్కడో చెడింది. అది గంటల తరబడి చర్చించాల్సిన అంశమే కాదు. సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్ అరెస్టై జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. ఆ అంశంపై అసెంబ్లీలో చర్చ జరపాల్సిన అవసరం ఏముంది? అల్లు అర్జున్‌పై కేసును విరమించుకున్నట్లు మృతురాలి భర్త ప్రకటించారు. ఇంకా దీనిపై రాద్ధాంతం ఎందుకు?” అని ప్రశ్నించారు.

## వ్యవసాయ బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 30 : ఒంటరితనం భరించలేక మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్న సంఘటన జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ లో జరిగింది. రాయికల్ ఎస్ఐ. సి.హెచ్. సుదీర్ రావు తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు మద్దెల జలంధర్ వ / రాజరం, 40 సం.లు, కులం: ఎస్సీ మాల, నేరెళ్ళ గ్రామానికి చెం దినవాడు. గత నాలుగు సం.ల నుండి అల్లీపూర్ గ్రామంలో టైలరింగ్ చేసుకుంటూ ఒంటరిగా జీవనం గడుపుతున్నాడు. ఒంటరిగా ఉండటం వల్ల అతిగా మద్యానికి బానిసై, ఒంటరి తనాన్ని తట్టుకోలేక జీవితం పై విరక్తి చెంది అలీ పూర్ గ్రామ శివారు లోని వ్యవసాయ బావిలో దూకి చనిపోయాడు. మృతుని అక్క లక్కం గంగవ్వ ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుంది అని తెలిపారు.



## మహిళల లైంగిక వేధింపులపై చర్యలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 30 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని తాసిల్దార్ కార్యాలయం నందు మహిళల వేధింపుల ఫిర్యాదుల పెట్టెను తేదీ 30-12-2024 రోజున ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా మండల తహసిల్దార్ ఖయ్యూం మాట్లాడుతూ రాయికల్ మండలంలోని మహిళలకు పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల గురించి మరియు బంధుమిత్రులలో లైంగిక వేధింపులు ఉన్నచో, స్నేహపూర్వక లైంగిక వేధింపులు ఉన్నచో టోల్ ఫ్రీ నెంబర్ కాకుండా మన రాయికల్ మండలంలోని తహసిల్దార్ కార్యాలయము నందు ఫిర్యాదుల పెట్టెను నిర్వహించినారు. మహిళలపై ఎలాంటి వేధింపుల గురించి అయినను ఉత్తరం రాసి ఆ పెట్టెలో వేసినచో గోప్యంగా విచారణ చేయడం జరుగుతుందని తెలియజేసినారు. ప్రతి ఒక్క మహిళకి చాలా అందుబాటులో ఉంటూ అనువైన సేవను అందించగలమని ఇట్టి విషయంలో ఎలాంటి సమస్య వచ్చినా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల తాసిల్దార్ ఖయ్యుమ్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎస్ఐ. కే స్వప్న, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి, రాధా, సూపర్వైజర్, జూనియర్ సహాయకురాలు సంధ్య, జల రికార్డ్ అసిస్టెంట్ గంగజల, సీనియర్ అసిస్టెంట్ రాజలింగం పాల్గొనడం జరిగింది.



## మర్రి జనార్దన్ రెడ్డి తండ్రి దశదినకర్మకు హాజరైన మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ - ఉప్పల వెంకటేష్

ఆమనగల్ డిసెంబర్ 30 వార్త మిర్రర్ : నాగర్ కర్నూల్ మాజీ శాసనసభ సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి తండ్రి మర్రి జంగి రెడ్డి ఏకాదశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ , మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ భగవంతుని ప్రార్థించడం జరిగింది. తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, సైదులు నరేష్ గౌడ్ పాల్గొన్నారు .



## వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో అమావాస్య అన్న ప్రసాద వితరణ

కాప్రా,వార్త మిర్రర్,డిసెంబర్ 30:వాసవి మిత్ర మండలి మేడ్చల్ మల్కాజ్గిరి ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య రోజు నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం ఈసీఐఎల్ చౌరస్తాలోని సాయిబాబా మందిరంలో తొలుత పూజలు చేసి అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.పేద వృద్ధురాలు మాలే వరమ్మకు వెయ్యి రూపాయల పింఛన్ అందజేశారు. వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన సంవత్సర 2025 క్యాలెండర్ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త,ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కార్యనిర్వాహక కార్యదర్శి గంపా కృష్ణ గుప్తా,ఉపాధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్త,తాటి శ్రీనివాస్ గుప్త,వై వి యు నాగేశ్వరరావు గుప్తా,కార్యదర్శులు చందా సంతోష్ గుప్త, అమర కృష్ణ గుప్త,బల్లి శ్రీధర్ గుప్త,కార్యవర్గ సభ్యులు మిర్యాల అరుణ్ గుప్త,ఉప్పల ఆంజనేయులు గుప్త, సభ్యులు ఉప్పల శ్రీనివాస్ గుప్త,రాయికంటి ముత్యాలు బస్సా శ్రీనివాస్ గుప్త,పెద్ది శ్రీనివాస్ గుప్త,గందే మల్లేష్ గుప్తా, దిడిగం కైలాసం గుప్తా,నీలా శివకుమార్ గుప్త,కొకలా కృష్ణమూర్తి గుప్త,మడిపడిగా నాగరాజు గుప్త,పెద్ది నవీన్ గుప్తా,రాజూరి జగదీష్,తాళ్లపల్లి అశోక్ గుప్తా,చంద్రగిరి తారకేశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ ఆది మహావిష్ణువును దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయి- వర్కల దానయ్య గౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : దేవలమ్మ నాగారం గ్రామంలో నారాయణుడు శ్రీ ఆది మహావిష్ణువుగా కొలువుదీరిన క్షేత్రంలో ఆలయ కమిటీ సభ్యులు వర్కల దానయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు, ఈ పూజలో పాల్గొన్న జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గణేష్ సాగర్,వర్క్ ల దానయ్య గౌడ్, పగిడోజ్ మహదేవ్, బొంగు వెంకటేష్ గౌడ్, పూజ అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దానయ్య గౌడ్ మాట్లాడుతూ శ్రీ ఆది మహావిష్ణువుని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తులు నమ్మకమని అన్నారు, శ్రీదేవి, భూదేవి సమేతంగా దర్శనమిచ్చే ఈ స్వామిని జగన్మోహిని గాను కొలుస్తారని అన్నారు, స్వామి కాళ్లకు పట్టీలు, మెట్టెలు, కడియాలు అలంకరిస్తారని విష్ణుమూర్తి దాల్చిన దశావతార రూపాల్లో ఇక్కడున్న విగ్రహంలో కనిపిస్తాయని తెలిపారు

# సిఆర్‌టిల 14వ సమ్మెకు సంఘీభావం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 30 : ఉమ్మడి అదిలాబాద్ జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలలో సి ఆర్ టి లుగా పనిచేస్తున్న సి ఆర్ టి ల 14వ సమ్మెకు ఆదివాసి దళిత హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కురిసెంగ వేణు సంఘీభావం తెలిపారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉట్నూర్ లో సమ్మె చేస్తున్న దాదాపు 1200 మంది సిఆర్టి ల సమస్యలు పరిష్కరించాలని వారి ఉద్యోగ భద్రత మరియు పే స్కేల్ మాత్రమే కోరుతున్నారని, గిరిజన సంక్షేమ శాఖను ప్రభుత్వం పరిపూర్ణంగా పట్టించుకున్నట్లయితే ఇట్టి సమస్యల్ని సత్వరమే పరిష్కరించగలుగుతారని, ఆకలితో పోరాడుతున్న ఆదివాసి సి ఆర్ టి లే రాష్ట్ర వ్యాప్తంగా 2,000 మంది సి ఆర్ టి టీచర్లుగా పనిచేస్తున్న నిరుద్యోగ యువత రాకముందు ఉత్తీర్ణత శాతం 10 ఉండేదని ఇప్పుడు ఆ పది కాస్త 90% వరకు పెరిగింది. అంటే అది సిఆర్టి ల కష్టపడితమేనని వారు అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ముందుకొచ్చి ప్రధానంగా చొరవ చూపి ఇట్టి సమస్యలు పరిష్కరించాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇట్టి సమస్యను పరిష్కరించకపోతే కొంతమేరకు నష్టపోతుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానికంగా ఉన్న రాజకీయ నాయకులు ప్రభుత్వం ఏర్పాటు కాకముందు అందరికీ మద్దతు పలికే వారని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా విచ్చేసి వీరి సమస్యలను పరిష్కరించే దిశగా వినతి పత్రాలను స్వీకరించి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యను కుంటూ పడకుండా చూడాలని కోరారు. ఉట్నూర్ లో జరుగుతున్న ఉద్యమానికే కాకుండా ఆదివాసి దళితుల ఎక్కడ జరిగిన ఆర్టీ ఉద్యమానికి ఆదివాసి దళిత హక్కుల పోరాట సమితి ఎల్లవేళలా ఉద్యమ పంతతో సాగుతారని ఈ సందర్భంగా చెప్పారు.

# కొండ మల్లేపల్లిలో ఘనంగా ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకలు





దేవరకొండ డిసెంబర్ 30 వార్త మిర్రర్ : ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భవ వేడుకలు కొండమల్లేపల్లి మండల కేంద్రం ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఘనముగా నిర్వహించడం జరిగింది. విద్యార్థి ఉద్యమాల పోరాటాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ అని దేవరకొండ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రామావత్ లక్ష్మణ్ నాయక్ బుడిగ వెంకటేష్ అన్నారు. సోమవారం నాడు న ఎస్ఎఫ్ఐ ఒకేషనల్ జూనియర్ కళాశాల కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రామావత్ లక్ష్మణ్ నాయక్ బుడిగ వెంకటేష్ హాజరై లిస్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం అనే నినాదంతో ఉన్న జెండాను డివిజన్ అధ్యక్షుడు రామావత్ లక్ష్మణ్ నాయక్ ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ 1970లో డిసెంబర్ నెలలో ఎస్ఎఫ్ఐ కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రంలో ఏర్పడిందన్నారు విద్యార్థుల సమస్యలే లక్ష్యంగా ఎన్నో విజయాలు సాధిస్తూ పోరాటాలను కొనసాగిస్తూ ఈ భారత దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘం గా అవతరించిందన్నారు నాటి నుండి నేటివరకు విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ ఈ భారత దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ముందుకు వెళు తుందన్నారు దేశంలో ఉన్నటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయి అన్నారు. ప్రైవేట్ కార్పొరేటు విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్య రంగాన్ని దెబ్బతీసే కుట్ర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం నర దగ్గరికి వస్తున్న కూడా ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రానికి విద్యశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ విద్య సమస్యలను బాగుచేయలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో ముఖ్య భూమిక పోషించిన పేద మధ్యతరగతి విద్యార్థులకు గత బి ఆర్ యస్ ప్రభుత్వం స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిందిన్నారు. కావునా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పేద మధ్యతరగతి విద్యార్థుల పక్షాన నిలబడి వారి చదువులు ముందు పోవాలంటే గత పెండింగ్లో ఉన్న స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మార్పు కావాలి కాంగ్రెస్ రావాలని చెప్పిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి తన వద్దనే వుంచుకున్న విద్యాశాఖ ను పటిష్టం చేయడానికి ఎవరి మీద నమ్మకం లేక నావద్దనే వుంచుకున్నాను చెప్పిన రేవంత్ రెడ్డి సర్కార్ కు ఇంటర్, డిగ్రీ, పిజి, బిటెక్ ఇతర కోర్సుల కళాశాలలో చదివే విద్యార్థుల గోడు ప్రభుత్వాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పేద మధ్యతరగతి విద్యార్థుల చదువులు ముందు పోవాలంటే ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలో చదువుకునే ప్రతి విద్యార్థికి ఆర్ టి ఎఫ్, ఎమ్ టి ఎఫ్ పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేస్తే విద్యార్థుల జీవితాలతో వెలుగులు నిండుతాయి అని అన్నారు. లేదంటే దేశంలో ఉన్నటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను రానున్న ఎన్నికలలో విద్యార్థులే గద్దె దింపుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ఇద్ధి రాములు, కొర్ర దినేష్, రామావత్ శరత్, రోహిత్ గదేపాక పూజ మంజుల నందిని సరస్వతీ చరణ్ వెంకటేష్ మహేష్ మల్లేష్ రాహుల్ సందీప్ రాజ్ కుమార్ లయ అనూష ప్రవళిక రవళి రమ్య తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐఎం విశాఖ జిల్లా మహాసభల్లో 35 తీర్మానాలు ఆమోదం

## సిపిఐఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు వెల్లడి



విశాఖపట్నం వార్త మిర్రర్ : సిపిఐఎం విశాఖ జిల్లా 24వ మహాసభలు పెందుర్తి, సుజా తనగర్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో అత్యంత జయప్రదంగా జరిగాయని, ఈ మహాసభల్లో కార్మిక, రైతు, మహిళ, యువజ, విద్యార్థి వంటి వివిధ వర్గాల ప్రజా సమస్యలను పరిష్క రించాలని సుమారు 35 తీర్మానాలు చేసి మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందని సిపిఐఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మీడియాకు తెలిపారు. జగదాంబ సెంటర్‌లో ఉన్న నండూరి ప్రసాదరావు భవనంలో సోమవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, వి.కృష్ణారావులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ విశాఖపట్నంలో అత్యంత కీలకమైన సమస్య, ప్రజలెదుర్కొంటున్న సమస్య ఇళ్ళు, ఇళ్ళస్థలాలు, ఇళ్ళపట్టాలు, పేదల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్య అని వీటి సాధనకోసం ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు ప్రజలను సమీకరించి పెత్తఎత్తున ఉద్యమించాలని తీర్మానించినట్లు తెలిపారు. పంచగ్రామలు, ఇనాం భూసమస్య, స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయిస్తూ సెయిల్‌లో విలీనంతో పాటు ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, జిల్లా సమగ్రాభివృద్ధి, స్థానిక యువతకు పరిశ్రమల్లో 75శాతం రిజర్వేషన్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అంతవరకు కనీసవేతనం 26వేలు ఇవ్వాలని, అసంఘటితరంగ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని, మహిళలపై హత్యలు, అత్యాచారాలు అరికట్టాలని, నిరుద్యోగ యువతకు ప్రభుత్వ సంస్థల్లో కొలువులు కల్పించాలని, జిల్లా గ్రంధాలయాన్ని తక్షణమే నిర్మించాలని, ఆస్తివిలువ ఆధారిత పన్ను, యూజర్ ఛార్జీలు రద్దుచేయాలని, ప్రతి మండలపరిధిలో ఒక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని, మెట్రోరైలతో పాటు వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ పనులు ప్రారంభించాలని, ఇఎస్‌ఐ 500 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మెడికల్ కాలేజీ విశాఖలో నిర్మించాలని, ఆర్టీసిలో ఎలక్ట్రికల్ బస్‌లు ఆర్టీసి సంస్థే నడిపి ప్రజారవాణా మరింత ప్రజలకు అందుబాటులో ఉంచాలని తదితర తీర్మానాలను జిల్లా మహాసభ ఆమోదించిందన్నారు. పై వాటిపై ప్రజలను సమీకరించి పార్టీ భవిష్యత్‌లో ఉద్యమ కార్యాచరణ చేపడుతుందన్నారు. వీటితో పాటు విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా, అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలన్న ఉద్యమాన్ని కొనసాగించాలని మహాసభ కర్తవ్యంగా పిలుపునిచ్చిందన్నారు. వీటి సాధనకోసం ప్రజలు, కార్మికులు, మేధావులు కలిసి రావాలని కోరారు. ఈ మహాసభలో సిపిఐఎం జిల్లా నాయకత్వం 400మంది ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. జిల్లా కార్యదర్శిగా మరడాన జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులుగా డా?బి.గంగారావు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, బి.పద్మ, కె.ఎం.శ్రీనివాసరావు, బి.జగన్, పి.మణి, వి.కృష్ణారావులతో పాటు మరో 16 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఈ మహాసభ ఎన్నుకుందన్నారు.





# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం ప్రకటించిన మున్సిపల్ కౌన్సిల్

మిర్యాలగూడ డిసెంబర్ 30:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఎజెండాపై చర్చ జరగకుండానే ముగిసింది. సోమవారం మున్సిపల్ కార్యాలయ మీటింగ్ హాలులో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అధ్యక్షతన సమావేశం ప్రారంభం కాగానే మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతికి సంతాప సూచకంగా 2 నిమిషాలు మౌనం పాటించి ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం సమావేశ ఎజెండాలోని అంశాలను చర్చించి ఆమోదించాలని మున్సిపల్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ ఎండీ.ఇలియాస్ కోరారు. ఇదే ఆఖరు సమావేశమని మళ్లీ చర్చించే అవకాశం లేదన్నారు. నాలుగేళ్లుగా అధికారంలో ఉండి మీరేం చేశారని కాంగ్రెస్ కౌన్సిలర్ ఎండీ.జాని క్రికెటర్ చెప్పడంతో బిఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశం నుండి వెళ్లి పోవడం, వెంటనే కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడ సమావేశం నుండి వెళ్లిపోవడంతో చైర్మన్ భార్గవ్ వర్గం కాంగ్రెస్ కౌన్సిలర్లు సుమారు 12 మంది మాత్రమే ఉండటంతో ఎలాంటి చర్చ జరగకుండానే సమావేశం ముగిసింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎండీయూసుఫ్, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న, టీపిఓ సోమయ్య, టిపిఎస్ అంజయ్య, హెల్త్ అసిస్టెంట్ జాఫర్ లు పాల్గొన్నారు.



## మైనర్లకు మద్యం
## అంతే కఠిన చర్యలు -కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్
## రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు ముందస్తు చర్యలు

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : రేపటి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అనుమతి లేని వినోదర కార్యక్రమాలు జరగకుండా పర్యవేక్షించడంలో భాగంగా ఈరోజు కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ యాదాద్రి జోన్ పరిధిలోని ఆలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఫామ్ హౌస్ లను పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీటీవీ వంటి భద్రతాపరమైన ఏర్పాట్లను పరిశీలించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అనుమతులు లేని ఎటువంటి కార్యక్రమాలను నిర్వహించకూడదని యాజమాన్యానికి సూచించారు. మైనర్లకు మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ గారి వెంట యాదాద్రి డిసిపి రాజేష్ చంద్ర ఐపీఎస్ , స్థానిక పోలీస్ సిబ్బందిఉన్నారు.



## జక్కిడి శివ చరణ్ రెడ్డిని ఘనంగా సన్మానించిన తోర్పునూరి శ్రీకాంత్‌గౌడ్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిది డిసెంబర్ 30 : తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నిక జక్కిడి శివ చరణ్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా వారి నివాసం వద్ద కలిసి న అనంతరం నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తోర్పునూరి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో పాటు నారాయణపూర్ మండల ఉపాధ్యక్షులు గుజ్జరి శ్రవణ్ కుమార్, చౌటుప్పల్ మండల ఉపాధ్యక్షులు గట్టు సాయి సుందర్, ప్రధాన కార్యదర్శి ఆవుల రాజు యాదవ్, కార్యదర్శి చింతల శివ ప్రసాద్ లు కూడా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి, ఎన్నిక అందరినీ అభినందించారు. రానున్న రోజుల్లో యువజన కాంగ్రెస్ ను బలోపేతం చేసి, యువతను యువజన కాంగ్రెస్ లొ భాగం చేయాలని తెలిపారు..

## జక్కిడి శివ చరణ్‌రెడ్డిని ఘనంగా సన్మానించిన చింతల శివప్రసాద్



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 30 : తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగాఎన్నిక సందర్భంగా జక్కిడి శివ చరణ్ రెడ్డి ని వారి నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి తనంతరం చౌటుప్పల్ మండల కార్యదర్శి చింతల శివ ప్రసాద్ శాలువా తో ఘనంగా సన్మానించడం జరిగింది. వారితో పాటు నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తోర్పునూరి శ్రీకాంత్ గౌడ్ కూడా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్నిక అందరినీ అభినందించారు. రానున్న రోజుల్లో యువజన కాంగ్రెస్ ను బలోపేతం చేసి, యువతను యువజన కాంగ్రెస్ లొ భాగం చేయాలని తెలిపారు..



## తెలుగు భాషాభివృద్ధికి కృషిచేయాలని గంటాను కోరిన వైఎల్పీ

విశాఖపట్నం వార్త మిర్రర్ : తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కోరారు. ఇటీవల విజయవాడలో రెండు రోజుల పాటు జరిగిన తెలుగు రచయితల మహాసభల వివరాలను, తీర్మానాలను గంటాకు వివరించి, మహాసభల జ్ఞాపికను అందజేశారు. మాతృ భాషను రక్షించుకోవడం తెలుగు వారందరి బాధ్యత అని ఈ సందర్భంగా గంటా పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

# పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## ఏబీవీపీ చింతపల్లి మండల కన్వీనర్ సన్నాయిల మహేష్



చింతపల్లి డిసెంబర్ 30 వార్త మిర్రర్ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చింతపల్లి శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాడు ఏబీవీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. విద్యార్థులను నిరుద్యోగ యువతను ఉద్ధరిస్తామని ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖను ఏమాత్రం పట్టించుకోవడం లేదని కనీసం విద్యాశాఖకు మంత్రిని నియమించక పోవడం సిగ్గుచేటు అని పేద విద్యార్థుల జీవితాలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్య వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టిస్తే ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యాశాఖను అలాగే కొనసాగించి విద్యా ర్థులకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఏబీవీపీ చింతపల్లి మండల కన్వీనర్ సన్నాయిల మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం విలేఖరులతో ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా ఉన్న రాష్ట్రం నేడు పాలకుల స్వార్థపూరిత ఆలోచనల వల్ల ఆర్థిక సంక్షోభంతో సతమతమవు తుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టల్లు సమస్యల కుంపటిలా మారాయన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఏబీవీపీ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ, విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. సిద్దిపేట పట్టణంలో జరిగిన 43వ రాష్ట్ర మహాసభల్లో మూడు తీర్మానాలు. ఆమోదించామన్నారు. మహాసభల్లో ఆమోదించిన విద్యారంగ సమస్యల తీర్మానాలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. విద్యార్థి, నిరుద్యోగులు కేసీఆర్ ప్ర భుత్వాన్ని గద్దెదించి కాంగ్రెస్ ని గద్దెనెక్కిస్తే కాంగ్రెస్ కూడా అదే బాటలో పరిపాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో విద్యకు 14శాతం నిధులు కేటాయిస్తే, తెలంగాణలో విద్యకు 6 శాతం నిధులు కేటాయించడం సరికాదన్నారు. గురుకులలో విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో చనిపోతున్నా ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తుందని మం డిపడ్డారు.ఏబీవీపీ నినాదం ఇస్తే ఆచరిస్తోందని, ఎక్కడ విద్యార్థులకు సమస్యలు తలెత్తినా అక్కడ ఏబీవీపీ పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ ప్రభుత్వా న్ని గద్దెదించే వరకు అన్ని వర్గాల ప్రజలకు ఏబీవీపీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఉమామహేష్, శ్రీకాంత్, శివ, వంశీ, నసీర్,మధు మరియు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి పోరాటాల వేగు చుక్క ఎస్ఎఫ్ఐ

## ఘనంగా ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భవ వేడుకలు





దేవరకొండ డిసెంబర్ 30 వార్త మిర్రర్ : విద్యార్థి ఉద్యమాల పోరాటాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ అని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ అన్నారు సోమవారం రోజున ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణలోని ఎస్ఎఫ్ఐ పలు కేంద్రాలలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ఉద్దేశించి వారు మాట్లాడుతూ స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం అనే నినాదంతో ఉన్న జెండాను ఆవిష్కరించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1970లో డిసెంబర్ నెలలో ఎస్ఎఫ్ఐ కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో ఏర్పడిందన్నారు విద్యార్థుల సమస్యలే లక్ష్యంగా ఎన్నో విజయాలు సాధిస్తూ పోరాటాలను కొనసాగిస్తూ ఈ భారత దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘం గా అవతరించిందన్నారు నాటి నుండి నేటివరకు విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ ఈ భారత దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ముందుకు వెళు తుందన్నారు దేశంలో ఉన్నటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయి అన్నారు ప్రైవేట్ కార్పొరేటు విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్య రంగాన్ని దెబ్బతీసే కుట్ర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందన్నారు రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం నర దగ్గరికి వస్తున్న కూడా ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రానికి విద్యశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ విద్య సమస్యలను బాగుచేయలన్నారు లేదంటే దేశంలో ఉన్నటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ను రానున్న ఎన్నికలలో విద్యార్థులే గద్దె దింపుతారు అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జల్లెల ఇద్ది రాములు, మోర రోహన్, కొర్ర దినేష్, రామావత్ శరత్, అపర్ణ, సౌజన్య,నందిని,శ్రావణి లావణ్య,మమత, అంజలి,సంధ్య,పూజ తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

# ఫేక్ డాక్యుమెంట్స్‌ను సృష్టించడంలో అతడికి అతడే సాటి

## ఫోర్జరీ డాక్యుమెంట్లను సృష్టించి 40 ఫీట్ల రహదారి కబ్జాకు గురి

## జైలుకు పంపినా కూడా అతనిలో మారని తీరు

## అతనిపై పీడీ యాక్ట్ పెట్టాలని స్థానికుల డిమాండ్





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 29 : ఫోర్జరీ డాక్యుమెంట్లను సృష్టించి ప్రజలను మోసం చేయడంలో అతనికి అతనే సాటి. గతంలో ఫోర్జరీ డాక్యుమెంట్లను సృష్టించి అతనిపై కేసులు ఉన్నా కూడా, అతనిలో మార్పు మాత్రం రాలేదు.సాధారణమైన డాక్యుమెంట్ రైటర్ ఫోర్జరీ డాక్యుమెంట్స్ సృష్టించి కోట్లకు పరిగెత్తాడు.మరల అతను ఫోర్జరీ చేసిన సంఘటన చౌటుప్పల్ పట్టణంలో కలకలం రేపింది.వివరాల్లోకి వెళితే :ఫోర్జరీ డాక్యుమెంట్లను సృష్టించి 40 ఫీట్ల బాటాను కబ్జా చేసిన సంఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది.చౌటుప్పల్ మండలంలో 2016 సంవత్సరము నుండి 2018 సంవత్సరం వరకు పంచాయితీ కార్యదర్శిగా గ్రేడ్ వన్ గా ఉన్నటువంటి శ్రీనివాస్ గుప్తా చౌటుప్పల్ గ్రామపంచాయతీ ఇన్చార్జి కార్యదర్శిగా ఉన్న సందర్భములో తన సంతకాన్ని ఫోర్జరీ చేసి, ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించి చౌటుప్పల్ మున్సిపాలిటీలోని వలిగొండ రోడ్డులో ఆరోజుల్లోనే 22 ఎకరాల 17 గుంటలకు సంబంధించిన భూమిలో ప్రభుత్వ భూమికి సంబంధించిన 40 ఫీట్ల రహదారిని.16 - 7 -2018 వ సంవత్సరంలో ఫోర్జరీ డాక్యుమెంట్స్ సృష్టించి 2024 వ సంవత్సరం ఈ మధ్యకాలంలో 40 ఫీట్ల రహదారిని నిర్మించుకున్నారని,చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ లో సదరు శ్రీనివాస్ గుప్తా చౌటుప్పల్ మున్సిపాలిటీ లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన సుర్కంటి మహేందర్ రెడ్డి పై చౌటుప్పల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు సుర్కంటి మహేందర్ రెడ్డిని అరెస్టు చేసి, విచారించగా ఇట్టి ఫోర్జరీ డాక్యుమెంట్ లో స్వాములవారి లింగోటం గ్రామానికి చెందిన ఆకుల శ్రీకాంత్, చౌటుప్పల్ మున్సిపాలిటీ తాళ్ల సింగారం గ్రామానికి చెందిన సుర్వి అంజయ్య గౌడ్, పేర్లు ఉన్నట్టుగా పోలీసు అధికారులకు సుర్కంటి మహేందర్ రెడ్డి తెలియజేయడంతో,పోలీస్ అధికారులు ఆకుల శ్రీకాంత్,సుర్వి అంజయ్య గౌడ్ పై కేసు నమోదు చేయగా,ఆకుల శ్రీకాంత్ పోలీసులకు పట్టుబడ గా, సుర్వి అంజయ్య గౌడ్ పరారీలో ఉండడంతో సుర్కంటి మహేందర్ రెడ్డి ని,ఆకుల శ్రీకాంత్ ను సోమవారం రిమాండ్ కు తరలించి దర్యాప్తు నిర్వహిస్తున్న పోలీసులు.ఇదిలా ఉండగా గతంలో డాక్యుమెంట్ రైటర్ ఆకుల శ్రీకాంత్ పై 2016 నుండి 2018 వరకు 5 ఫోర్జరీ కేసులు నమోదు అవ్వడం విశేషం.2020లో అతనిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపడం కూడా జరిగింది. అయినా కూడా అతని వైఖరిలో మార్పు రాకపోవడం గమనార్హం.ఇప్పటికైనా అతనిపై పోలీసు ఉన్నతాధికారులు పీడీ యాక్ట్ పెట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.



## ట్రిపుల్ ఆర్ నార్త్ సైడ్ టెండర్ల పైన భూ నిర్వాసితులు ఎంపీ ఈటల రాజేందర్ కు వినతి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 30 : త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము నార్త్ సైడు టెండర్ల ప్రక్రియ పైన ఇచ్చిన ప్రకటన ఆశాస్త్రీయమని,94% భూ సేకరణ అయిపోయిందని రాష్ట్ర ప్రభుత్వము కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు లెక్కలు చెప్పి టెండర్ ప్రక్రియను కొనసాగించాలని చేస్తున్న ప్రచారము బూటకమని, భువనగిరి జిల్లావ్యాప్తంగా ఒక్క రైతు కూడా అంగీకార పత్రం ఇవ్వకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని చౌటుప్పల్ మండల భూనిర్వాసితులు సోమవారం పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ కు వినతి పత్రం అందజేశారు . ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, భూ నిర్వాసితులు గుజ్జుల సురేందర్ రెడ్డి, దబ్బేటి రాములు గౌడ్, మరుపాక లింగం గౌడ్ ,సంద గళ్ళమల్లేష్ గౌడ్, జాల వెంకటేష్ యాదవ్, జాల శ్రీశైలం యాదవ్, నరసింహ యాదవ్, జంగయ్య యాదవ్, అంజయ్య, బొమ్మిరెడ్డి ఉపేందర్ రెడ్డి, ఏసి రెడ్డి దామోదర్ రెడ్డి,పంకర్ల యాదయ్య యాదవ్,వల్లూరి భోగయ్య, గజ్వేల్ బోనగిరి భూనిర్వాసితులు జోసెఫ్, శ్రీనివాస్, కనకరాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత యాదవ మహాసభ యూత్ అధ్యక్షులుగా ఎడ్ల గిరి యాదవ్



చందంపేట డిసెంబర్ 30 వార్త మిర్రర్ : చందంపేట మండలంలో యాదవ యువతను మరింత బలోపేతం చేస్తానని అఖిల భారత యాదవ మహాసభ మండల యూత్ అధ్యక్షులు ఎడ్ల గిరి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. దేవరకొండ పట్టణంలో జరిగిన అఖిల భారత యాదవ మహా సభ లో చందంపేట మండల యూత్ అధ్యక్షు లుగా మండల కేంద్రానికి చెందిన ఎడ్ల గిరి యా దవ్ ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల ఏడుకొండల యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మండల యూత్ అధ్యక్షులు ఎడ్ల గిరి యాదవ్ మాట్లాడుతూ అఖిల భారత యాదవ మహాసభ లో యువత కీలక పాత్ర పోషించే విధంగా పనిచేస్తానని అని యువతను మరింత మండల స్థాయిలో గ్రామస్థాయిలో విస్తృత స్థాయిలో పనిచేస్తానని వారు తెలిపారు తన ఎన్నికలకు సహకరించిన చందంపేట మండల అధ్యక్షులు శివ నారాయణ యాదవ్ యాదవ సంఘం ముఖ్య నాయకులు తిమ్మాపురం పిఎసిఎస్ చైర్మన్ కొండ శ్రీశైలం యాదవ్ చందంపేట మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య యాదవ్ ఏడుపుల గోవింద్ యాదవ్ మండల ఉపాధ్యక్షులు జబ్బు తిరుపతయ్య యాదవ్ నోముల మల్లయ్య యాదవ్ నక్క నరసింహ యాదవ్ బచ్చనబోయిన జగదీష్ యాదవ్ లకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.





## పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి : డి.ఎస్.పి కే రాజశేఖర్ రాజు

మిర్యాలగూడ, డిసెంబర్ 30:-( వార్త మిర్రర్) : పోలీసు స్టేషన్లో కేసులు పెండింగ్ లో ఉండవద్దని సత్వరం పరిష్కరించాలని మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర రాజు కోరారు. మిర్యాలగూడ ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ ను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధులు నిర్వహణ, స్టేషన్ పరిధిలో జరిగిన నేరాల నివారణ చర్యలు, కేసుల సత్వర పరిష్కార మార్గాలు, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. స్టేషన్ రికార్డు రూం, కానిస్టేబుల్స్ కు అందించిన సామాగ్రి పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అదేవిదంగా అన్ని విభాగాలలో ఉత్తమ పనితీరును పరిశీలించి ఒన్ టౌన్ స్టేషన్ ఇంఛార్జ్ ఇన్స్పెక్టర్ కోట కరుణాకర్, ఎస్ఐలు శ్రీనివాస్ సిబ్బందిని అభినందించారు.

# అంబేద్కర్‌పై అమీత్ షా అనుచిత వ్యాఖ్యలకు సిపిఎం నిరసన



మిర్యాలగూడ డిసెంబర్ 30:-( వార్త మిర్రర్) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షాను వెంటనే మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కేంద్ర కమిటీ పిలుపుమేరకు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ముందు చూపు ఆలోచనతో రాజ్యాంగాన్ని రచించారని రాజ్యాంగం ప్రకారమే కేంద్ర మంత్రి అమిత్ షా పదవిలో కొనసాగుతున్నాడని గుర్తుంచుకోవాలన్నారు. రాజ్యాంగం ఉండడం వల్లనే దేశంలో ప్రజాస్వామ్యం బతుకుతుందని చెప్పారు. రాజ్యాంగాన్ని రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. దేశాన్ని మతదేశంగా మార్చేందుకు చూస్తున్నారని అన్ని మతాలున్న దేశంలో లౌకికతత్వం పెంపొందించాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై అనిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు దీని కోసం ప్రధానమంత్రి జోక్యం చేసుకొని అమిత్ షా తో రాజీనామా చేయించాలని అవసరమైతే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు మూడవత్ రవినాయక్, రెమిడాల పరుశురాములు, రాగిరెడ్డి మంగా రెడ్డి, ఆయూబ్, సిపిఎం ఒన్, టౌన్ టూ టౌన్ కార్యదర్శులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, భావండ్ల పాండు,కందుకూరి రమేష్, కోడి రెక్క మల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి, గోవర్ధనా, అరుణ, ఉర్మిల, డివైఎఫ్ఐ కార్యదర్శి పల్లా బిక్షం, పూలమ్మ, రాంచంద్రు, దైద దేవయ్య, యేసు, ఎంఎన్ రెడ్డి వెంకట్ రెడ్డి, చారి పాల్గొన్నారు.

# న్యాయవాది మ్యాన మహేష్‌కుమార్‌కు గౌరవ డాక్టరేట్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 30 : జగిత్యాల పట్టణానికి చెందిన న్యాయవాది, సామాజిక సేవకుడు మ్యాన మహేష్ కుమార్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈనెల 28 న సికింద్రాబాద్, లోని సిటీ కల్చరల్ ఆడిటోరియంలో స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ అకాడమీ, స్ఫూర్తి సకల కళా వేదిక ఆధ్వర్యంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి ప్రముఖులచే గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేశారు. మ్యాన మహేష్ కుమార్ "ప్రేరణ ఫౌండేషన్ "ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ఇవ్వడం జరిగిందని నిర్వాహకుడు ఆకుల రమేష్ తెలిపారు. హైకోర్టు న్యాయవాదిగా, రాష్ట్ర యువజన సంఘాల సమైక్య అధ్యక్షులుగా, జగిత్యాల జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షులుగా ఏబీవీపీ, బిజేవైయమ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బీజేపీ నిర్మల్, మంచిర్యాల జిల్లాల ఇంచార్జి గా పనిచేసి సామాజిక సేవతో పాటు పలు సంఘాలకు బాధ్యులుగా వ్యవహరిస్తున్నందుకు గాను గౌరవ డాక్టరేట్ ను మ్యాన మహేష్ కుమార్ కు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. గౌరవ డాక్టరేట్ అందుకున్న మ్యాన మహేష్ కుమార్ ను న్యాయవాదులు, పట్టణ ప్రముకులు, పలువురు మిత్రులు అభినందించారు.



# గల్లీకో బెల్ట్!

**యదేచ్ఛగా వీధికో బెల్ట్ షాపు**


**ఎన్నికల సమయంలోనే బెల్ట్ షాపులపై కేసులా..?**

**నిద్ర మత్తులో ఎక్సైజ్ శాఖ**

**మత్తుకు బానిస అవుతున్న యువత**

**నిఘా వాహనం జాడే లేదు**

## బెల్ట్ షాపులు ఆపే నాథుడే లేడా!?



కల్వకుర్తి డిసెంబర్ 30 వార్త మిర్రర్ ప్రతినిధి:- పట్టణాలు గ్రామాలు అనే తేడా లేకుండా అక్రమ మద్యం విక్రయాలు జోరందుకున్నాయి.ఏ వీధిలో చూసిన బెల్ట్ షాపులో దర్శనమిస్తున్నాయి.కల్వకుర్తి,వివిధ గ్రామాలలో బెల్ట్ షాపుల ద్వారా యువత పెడదారి పడుతున్నారు.యువత భవిష్యత్తు మద్యం మత్తు లోకి వెళుతుంది.యువత భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా తయారైంది. దీని మూలంగా యువకుల జీవితం అంధకారంలోకి వెళ్తుంది. మద్యం మత్తులో దోపిడీ, దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో పోటీపడి మరి బెల్టు షాపులు పట్టణం,గ్రామాల్లో పుట్టగొడుగుల దర్శనమిస్తున్నాయి.మద్యం దుకాణాలను తనిఖీలు చేసే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### బెల్ట్ షాపులు అంతట ఉన్నాయిలే అంటూ మౌనం

పట్టణాలలో గ్రామాలలో ఉదయం రాత్రి అనే తేడా లేకుండా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి.కొత్తగా ఎక్సైజ్ శాఖ మద్యం పాలసీ తీసుకొచ్చిన యంఆర్ఎఫ్ ధరలకే మద్యం విక్రయించేలా కల్తీ మద్యాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే ఉన్నత అధికారులు పట్టించుకోకపోవడంతో బెల్ట్ షాప్ ల నిర్వాహకులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఒక్కొక్క గ్రామంలో 5 నుంచి 10 బెల్టు షాపులు ఉన్నాయంటే అక్రమ మద్యం ఏమేరా ఏరులై పారుతుందో అర్థం చేసుకోవచ్చు.నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి.

పేరుకు మాత్రమే కిరాణం 24/7 మందు గ్రామాలలో కిరాణం పేరుతోఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న బెల్ట్ షాపులు ఉదయం 4 గంటల నుంచి అర్ధరాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటున్నాయి.గ్రామాలలో కూలీలు మద్యానికి బానిసలై పనులకు వెళ్లకుండా బెల్ట్ షాపుల్లోనే తాగుతున్నారు.గ్రామాలలో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి.టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు లాభార్జన ధ్యేయంగా గ్రామీణ ప్రాంతాల వారికి విక్రయిస్తున్నారు.రహదారుల వెంబడి మద్యం వి విక్రయించవద్దని నిబంధనలు ఉన్న గ్రామాలలో రోడ్ల పక్కనే దర్జాగా మద్యం విక్రయిస్తున్నారు. వ్యాపారులు అటు పోలీసులు ఎక్సైజ్ అధికారులు చేతులు తడితే తమ వ్యాపారాన్ని విరాటకంగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు పెద్ద ఎత్తున వెలువెత్తుతున్నాయి.

ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూద్దాం మరి..



## చిన్నారులను చిన్నప్పటి నుంచే ప్రతిభావంతులుగా తీర్చి దిద్దాలి ::: ప్రగతి ప్రిన్సిపాల్ బాలె శేఖర్.

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 30 : చిన్న పిల్లలు పాఠశాలకు వెళ్లి వచ్చిన అనంతరం సెల్ ఫోన్ కు అలవాటు కాకుండా, చిన్నపిల్లలకు చిన్నప్పటి నుండి పలు అంశాల పై అవగాహన కల్పించాలని జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ కేంద్రం లోని ప్రగతి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ తెలిపారు. సోమవారం పాఠశాలలో చిన్నారులకు రైమ్స్ కాంటాటా కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు నృత్యం చేస్తూ వీక్షకులను అలరించారు. చిన్నారులకు పలు విషయాలపై అవగాహన ఉండేందుకు రైమ్స్ కాంటాటా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయశ్రీ, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్ లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

## సిహెచ్.సుధీర్ రావు, ఎస్ఐ, రాయికల్




వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 30 : రాబోయే నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలని జగిత్యాల జిల్లా రాయికల్ ఎస్ఐ. సిహెచ్.సుధీర్ రావు అన్నారు. డిసెంబర్ 31 రోజున, నూతన సంవత్సర వేడుకల్ని జరుపుకునే వాళ్ళు చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపడుతామన్నారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి రోడ్ల పైన కెకులు కట్ చేయడం, బాణాసంచాలు పేల్చడం చట్టరీత్య నేరమని, మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు చేపడుతామన్నారు. అంతే కాకుండా మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, మద్యం సేవించి వాహనం నడిపి అపాయాన్ని కొని తెచ్చుకొని, మిమ్మల్ని నమ్ముకున్న, మీ మీద ఆధార పడ్డ వారి జీవితాలను నాశనం చేసుకొవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరు నూతన సంవత్సరాన్ని కుటుంబ సమేతంగా జరుపుకోవాలని రాయికల్ ఎస్సై సిహెచ్.సుధీర్ రావు ప్రజలకు, యువతకు సూచించారు.. ఈ సందర్భంగా మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



## మాణికేశ్వరి నగర్ బస్తీలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దానంకు కాంగ్రెస్ నేతల వినతి

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 30... మాణిక్యేశ్వరీ నగర్ బస్తీలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించేందుకు కృషి చేయాలని కోరుతూ బస్తీ కాంగ్రెస్ నాయకులు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు అమ్ముల శ్రీనివాస్, డిసిసి ప్రధాన కార్యదర్శి వరికుప్పల రవి, గండికోట వెంకటేష్,లింగయ్య ,అశోక్, ఈ. నరసింహ,ముత్తయ్య,కె. నరసింహ తదితరులు దానం నాగేందర్ ను కలిసిన వారిలో ఉన్నారు. బస్తీలో సుమారు 40,000 మంది జనాభా ఉన్నారని వారందరి సౌకర్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించాలని కోరారు.



## అసంపూర్తిగా ఉన్న సింగాపూర్ రోడ్డు పనులను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కు బిజెపి నాయకుల వినతి

శంకర్‌పల్లి : డిసెంబర్:30: (వార్త మిర్రర్) : శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 1,9,10 సింగపురం వార్డుల పరిధిలో రెండు వరుసల ప్రధాన రహదారి రోడ్డు వాగు వరకు వేశారు. అసంపూర్తిగా ఉన్న మిగిలిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలని సింగాపురం బిజెపి కార్యకర్తలు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వర్షం పడిన సమయంలో బురదలో నుండి ప్రయాణించాల్సిన అవసరం ఏర్పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు, పాదాచారులు రోడ్డుపై గుంతల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ కొంత భాగం రోడ్డు సమస్యను తీర్చాలని కమిషనర్ ను కాలనీవాసులు కోరారు. కార్యక్రమంలో వార్డుల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పంచముఖి లింగేశ్వర ఆలయాన్ని సందర్శించిన విద్యార్థులు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 30 : క్షేత్ర పర్యటనలో భాగంగా జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో ఉన్న ప్రాచీన పంచముఖి లింగేశ్వర ఆలయాన్ని జగిత్యాల పట్టణ కేంద్రం బీట్ బజార్ లోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. విద్యార్థులు ఆలయంలోని విభిన్న శిల్పకళను పరిశీలించి, దాని చారిత్రక ప్రాముఖ్యత గురించి సమాచారం పొందారు. ఆలయం విశేషాలను వివరించారు, ప్రధానంగా ఈ ఆలయ నిర్మాణ శైలి, ఐదు ముఖాలతో ఉన్న లింగం ప్రత్యేకత, మరియు ఆలయానికి సంబంధించిన పురాణ కథలను వివరించారు. విద్యార్థులు పర్యటన ద్వారా చారిత్రక మరియు సాంస్కృతిక మూలాలను గురించి ఆసక్తిగా నేర్చుకున్నారు.ఈ తరహా పర్యటనలు విద్యార్థుల్లో చారిత్రక అవగాహనను పెంపొందించడంలో తోడ్పడతాయని పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జనవరి 3న సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ::: బిఎస్పి జిల్లా ఉపాధ్యక్షులు బిరుదుల లక్ష్మణ్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 30 : జగిత్యాల పట్టణంలో జనవరి 3న సావిత్రిబాయి జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు బిఎస్పి పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధ్యక్షులు బిరుదుల లక్ష్మణ్ ( న్యాయవాది) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాష్ట్రలో పిన్నవయసులో పెళ్లి చేసుకుని భర్త మహాత్మ జ్యోతి రావు పూలే అడుగుజాడల్లో కులమత బేధాలు లేకుండా సమ సమాజాన్ని ప్రేమించి ఆధునిక విద్య ద్వారానే స్త్రీలకు విముక్తి సాధ్యమని నమ్మి భర్త జ్యోతిరావు పూలే తో కలిసి 1848లో జనవరి 1న పూణేలో మొదటి బాలికల పాఠశాల స్థాపించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం

### చండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పానుగోతు బాలునాయక్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కరంటోతు రమేష్‌నాయక్

సంస్థాన్ నారాయణపూర్ డిసెంబర్ 30, ( వార్త మిర్రర్):సంస్థాన్ నారాయణపూర్ మండల పరిధిలోని వెంకం భావి తండా గ్రామానికి చెందిన జాటోతు రవి,తండ్రి తార్య కి సీఎం సహాయక నిధి నుండి విడుదలైన 39,000/-ముప్పై తొమ్మిది వేల చెక్కును చండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పానుగోతు బాలునాయక్,ఎస్టి సెల్ మండల అధ్యక్షులు కరంటోతు రమేష్ నాయక్ అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు పనుగోతు కృష్ణ,వడ్తియా శంకర్,గ్రామ నాయకులు కరంటోతు శక్రు నాయక్,రమావత్ లాలసింగ్,రమవత్ రాజు,కోట,కొర్ర ఘంశ,హాతిరం,కరంతోతు కృష్ణ,సుదీప్,పనుగోతు కిషన్,జగ్రామ్, గోపాల్,రమేష్, సురేందర్,రాములు,గన్నా, చించు,రఘు,పాండు,నవీన్,తదితరులు, పాల్గొన్నారు.





## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్.. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణకు వెళ్లిన ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, శ్రీరామ్ శివకుమార్

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 30 ....ఈటూరు గ్రామం తుంగతుర్తి నియోజకవర్గం ఈటూరు ప్రభుత్వ పాఠశాల సమీపంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ తోపాటు ఏపూరి సోమన్న, కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్, టీజేఏసీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ శ్రీరామ్ శివకుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.